క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

భద్రాచలంఅర్బన్: అర్హత కలిగిన అధ్యాపకులు, ఉపాధ్యాయులందరూ వచ్చేనెల 6లోగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని భద్రాచలం మండల విద్యాధికారి రమ సూచించారు. బుధవారం పట్టణంలోని కోర్రాజులగుట్ట ప్రభుత్వ పాఠశాలలో అధ్యాపకులు, ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ (ఉపాధ్యాయ) ఎన్నికలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు ప్రతి ఒక్కరూ వచ్చే నెల 6వ తేదీ వరకు తమ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. అందుకోసం ఫామ్-19లో ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు సర్వీస్‌కు సంబంధించిన సర్టిఫికెట్‌ను కూడా ఫార్మ్‌తో పాటు జతపరచాలని సూచించారు. అనంతరం భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడారు. ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యా వనరుల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రెండో జోన్‌కు నీళ్లివ్వాలి

దుమ్ముగూడెం: మండలంలోని తాలిపేరు కాలువ కింద ఉన్న భూములకు ఈ ఏడాది రెండో జోన్‌కు నీళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం పెద్ద నల్లబెల్లి శాఖ మహాసభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మరమ్మతుల పనులు ఏవైనా ఉంటే అవి మార్చి 15 తర్వాతకు వాయిదా వేసుకోవాలని, ప్రస్తుతం రైతాంగం ఇబ్బంది పడే విధంగా తాలిపేరు అధికారులు నిర్ణయం తీసుకోకూడదని కోరారు. కార్యక్రమంలో మర్మం చంద్రయ్య, మట్టా ముద్ద రాజు, మండల కమిటీ సభ్యులు కే గోవర్ధన్, యాకూబ్ రెడ్డి, కొన్నే రాములు, నరసింహారావు, రామ్మూర్తి, విజయలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

20న విలీన సభ

ములకలపల్లి: సంఘటిత, అసంఘటిత రంగాల్లో రంగాల్లో పని చేస్తున్న మూడు సంఘాలు ఒకే సంఘంగా ఏర్పడుతున్న సందర్భంగా ఈ నెల 20వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న విలీన సభను విజయవంతం చేయాలని ఇఫ్టూ జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు పిలుపునిచ్చారు. ములకలపల్లిలో బుధవారం జరిగిన సంఘ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకుడు నూపా భాస్కర్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు నూపా సరోజిని, ఇఫ్టూ పాల్వంచ ఏరియా కమిటీ అధ్యక్షుడు వేల్పుల రమేష్, కీసరి వెంకటేశ్వర్లు, బత్తుల ఆంజనేయులు, ఓరుగంటి శ్రీనివాస్, తాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సమన్యాయం

అశ్వాపురం: ఇందిరమ్మ రాజ్యంలో అందరికీ సమన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళిత బంధు, బీసీ బంధు లబ్ధిదారుల ఎంపిక ఎలా చేశారని ఆయన ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాన్ని బీఆర్ఎస్ నాయకులు చూపిస్తారా అని ప్రశ్నించారు.

రోడ్డు మరమ్మతు పనుల పరిశీలన

మణుగూరురూరల్: మండలంలోని రామానుజవరంలో ఇటీవల వర్షాలతో దెబ్బతిన్న రహదారి మరమ్మతులను పంచాయతీ అధికారుల ఆధ్వర్యాన చేపట్టారు. ఈ మేరకు పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్ తదితరులు బుధవారం పరిశీలించి మాట్లాడారు. రోడ్డు మరమ్మతులు పూర్తయితే రాకపోకలకు ఇక్కట్లు తీరుతాయని తెలిపారు. లేళ్ల ముత్తయ్య, బాడిశ నాగేష్, షేక్ లతీఫ్, రాసమల్ల నాగరాజు, సీతయ్య, సాంబ, ప్రసాద్, గంగాధర్, బిక్షం, కృష్ణారావు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ములకలపల్లి: ఖాతాదారులకు బ్యాంకుల్లో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ ములకలపల్లి శాఖ మేనేజర్ రవీంద్ర సూచించారు. మండలపరిధిలోని సీతాయిగూడెం గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'జన్ సురక్ష'పథకంలో అందిస్తున్న జీవిత బీమా వివరాలను వెల్లడించారు. బ్యాంకుల్లో కేంద్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలపై అవగాహన కల్పించారు. ఆర్బీఐ కౌన్సిలర్ నవీన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల ఊసేది?

బూర్గంపాడు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు డి.పున్నం చంద్ డిమాండ్ చేశారు. బుధవారం బూర్గంపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆసరా పింఛన్లను రూ.4వేలకు పెంచుతామన్న హామీని ఇప్పటి వరకు ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. పెరిగిన జీవన ప్రమాణాలకు అనుగుణంగా ఆసరా పింఛన్లను పెంచాలని డిమాండ్ చేశారు.

విధుల్లో చేరిన కొత్త టీచర్లు

- నియామక పత్రాలు అందజేసిన ఎంఈఓలు
- పాఠశాలల్లో తీరనున్న ఉపాధ్యాయుల కొరత



అశ్వారావుపేటరూరల్: నూతన టీచర్లకు జాయినింగ్ కాపీ అందిస్తున్న ఎంఈఓ ప్రసాద్



చర్ల: విధుల్లో చేరేందుకు ఎంఈఓ ఆఫీస్‌కు చేరుకున్న నూతన ఉపాధ్యాయులు

దమ్మపేట: ఇటీవల తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ పరీక్షల్లో అర్హత సాధించి, నియామక పత్రాలను పొందిన అభ్యర్థులు, నూతన ఉపాధ్యాయులుగా మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం విధుల్లో చేరారు. మండలంలో నూతనంగా 29 మంది ఎస్జీటీలు, ఎడుగురు స్కూల్ అసిస్టెంట్లు మొత్తంగా 36 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరినట్టుగా మండల విద్యాశాఖ అధికారి కీసర లక్ష్మి తెలిపారు. డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థులు సంబంధిత ధ్రువ పత్రాలతో మండల విద్యా వనరుల కేంద్రానికి రాగా, పరిశీలించి సంబంధిత పాఠశాలల్లో వారికి చేరిక పత్రాలను అందజేశామని ఎంఈఓ తెలిపారు.

దుమ్ముగూడెం: డీఎస్సీ 2024 ద్వారా మండలానికి కేటాయించిన 20మంది నూతన ఉపాధ్యాయులు వివిధ పాఠశాలల్లో బుధవారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా మండల విద్యావనరుల కార్యాలయం వద్ద రిపోర్టు చేసిన సదరు ఉపాధ్యాయులకు తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంఈఓ సున్నం సమ్మయ్య చేతుల మీదుగా నియామక పత్రాలను అందుకున్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ఏవీ రామారావు, హెచ్‌యం ఏజే ప్రభాకర్, వివిధ యూనియన్‌ల బాధ్యులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: నూతన ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో జరిగిన కౌన్సిలింగ్‌లో అశ్వారావుపేట మండలానికి మొత్తం 55 మంది ఉపాధ్యాయులను కేటాయించగా, వీరిలో 49 మంది ఎస్జీటీలు, 6గురు స్కూల్ అసిస్టెంట్‌లు ఉన్నారు. వీరంత స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈఓ ప్రసాద్ రావుకు రిపోర్ట్ చేయగా, వారికి ఆయన చేతుల మీదుగా జాయినింగ్ ఆర్డర్‌లను అందజేశారు. అనంతరం నూతన టీచర్లు వారికి కేటాయించిన ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరగా, కొంతకాలంగా మండల పరిషత్ పాఠశాలల్లో ఖాళీగా టీచర్ పోస్టులన్నీ భర్తీ అయ్యాయి.

చర్ల: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో బుదవారం 62 మంది నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేశారు. డీఎస్సీ ద్వారా ఎంపికైన 52 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు, 10 మంది స్కూల్ అసిస్టెంట్లు మండలంలోని వివిధ మండల పరిషత్, మండల పరిషత్ ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ హైస్కూళ్లలో జాయిన్ అయ్యారు. వీరంతా మండల విద్యాశాఖాధికారి కార్యాలయంతో పాటు ఆయా స్కూల్ కాంప్లెక్స్‌ల ప్రధానోపాధ్యాయులకు జాయినింగ్ రిపోర్టులు అందజేశారు.

కరకగూడెం: డీఎస్సీ ఫలితాల్లో విజేతలుగా నిలిచి నియామక పత్రాలు అందుకున్న పలువురు టీచర్లు బుధవారం మండల కేంద్రంలోని ఎంఆర్సీలో వివిధ పాఠశాలల్లో జాయిన్ అవుతున్నట్లు ఎంఈఓకు రిపోర్ట్ చేశారు.

17మంది సెకండరీ గ్రేడ్ టీచర్స్, 03స్కూల్ అసిసెంట్లు రిపోర్ట్ చేశారని, ఇంకా నలుగురు ఉపాధ్యాయులు రిపోర్ట్ చేయాల్సి ఉందని ఎంఈఓ గడ్డం మంజుల తెలిపారు. 11 మంది ఉపాధ్యాయులు రిలీవ్ అయినట్లు వెల్లడించారు.



దుమ్ముగూడెం: నియామక పత్రాలను అందజేస్తున్న తహసీల్దార్, ఎంఈఓ



దమ్మపేట: నూతన ఉపాధ్యాయులకు చేరిక పత్రాలను అందజేస్తున్న ఎంఈఓ కీసర లక్ష్మి

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కరకగూడెం: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ బాధ్యులు

కరకగూడెం: కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి మద్దతు ధర దక్కుతుందని కరకగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం స్టాఫ్ అసిస్టెంట్ చందా కాంతారావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం మండల పరిధిలోని మోతె గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,320, గ్రేడ్‌బీ రకానికి రూ.2,300 మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తెస్తున్నప్పుడు పట్టాదార్ పాస్ పుస్తకం, బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ రావుల కనకయ్య, గ్రామస్తులు అక్కిరెడ్డి వెంకట రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏడీఈగా బాధ్యతలు స్వీకరణ

చర్ల: చర్ల విద్యుత్‌శాఖ ఏడీఈగా జి.ప్రభాకర్‌రావు బుదవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జ్ ఏడీగా పని చేసిన టి.వేణును ఐటీడీఏ ఏడీఈ (పవర్)గా బదిలీ కాగా.. లక్ష్మీదేవిపల్లిలో విధులు నిర్వర్తిస్తున్న బి.ప్రభాకర్‌రావు బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా దుమ్ముగూడెం ఏఈ మోహన్‌రెడ్డి, చర్ల దుమ్ముగూడెం మండలాల్లో పని చేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది నూతనంగా విధుల్లో చేరిన ఏడీఈ ప్రభాకర్‌రావును కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.



చర్ల: నూతనంగా విధుల్లో చేరిన ఏడీఈకి పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న ఉద్యోగులు

బదిలీ ఏడీఈకి వీడ్కోలు..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం విద్యుత్ శాఖ ఏడీఈ(ఆపరేషన్)గా విధులు నిర్వహిస్తూ సోమవారం భద్రాచలం ఐటీడీఏ విద్యుత్ విభాగంలో ఏడీఈగా బదిలీ వెళుతున్న వేణును స్థానిక ఉద్యోగులు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈయనతోపాటు వివిధ హోదాల్లో విధులు నిర్వహించి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్తున్న సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ కృష్ణయ్య, లైన్ ఇన్స్పెక్టర్లు సర్వేశ్వరరావు, ఏడుకొండలు, లైన్‌మెన్లు జగన్‌మోహన్ రెడ్డి, జిలానీ, శ్రీను, లోకేష్, చల్లా శ్రీను, ఎస్‌జీఎస్‌టీ ఉమాలను శాలువాతో ఘనంగా సన్మానించారు.

నాసిరకంగా డ్రైయినేజీ పనులు

అశ్వారావుపేటరూరల్: కమీషన్ల కోసమే రూ.కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న డ్రెయినేజీ పనుల్లో నాణ్యత లేకున్నా పట్టించుకోవడం లేదని మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి ఆరోపించారు. అశ్వారావుపేటలోని సత్తుపల్లి, జంగారెడ్డిగూడెం మార్గాల్లో రూ.రూ.3.5కోట్లతో నిర్మిస్తున్న డ్రెయినేజీ పనులను ఆయన బుధవారం పరిశీలించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేయగా, ప్రస్తుత అధికార పార్టీ నాయకులు కమీషన్ల కోసం కాంట్రాక్టర్‌ను మార్చేశారని విమర్శించారు. సదరు కాంట్రాక్టర్ నాణ్యత పాటించక పోవడంతో చిన్న పాటి వర్షానికే కాంక్రీట్ గోడ కూలిపోయిందన్నారు. అంతేకాక పనులను డీఈఈ, ఏఈఈలకు బదులు గ్యాంగ్‌మెన్లు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఇకనైనా పనులపై అధికారులు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు సత్యవరపు సంపూర్ణ, ప్రకాశ్‌రావు, చిప్పనపల్లి బజారయ్య పాల్గొన్నారు.

వైద్యవిద్యార్థులకు సన్మానం

బూర్గంపాడు: సారపాకకు చెందిన మాదుగుల నర్సింహారావు, రమాదేవి దంపతుల కుమార్తె సుజిత ఇటీవల ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. కటింగ్ సెలూన్ నడుపుకుంటు జీవనం సాగిస్తున్న నర్సింహారావు కుమార్తె ప్రతిభ చూపి భూపాలపల్లి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. పేదరికంలో ఉండి కూడా కష్టపడి చదివి మెడిసిన్ సీటు సాధించిన సుజితను బుధవారం మండల నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఉప్పెర్ల సీతారాములు, ఉప్పెర్ల అన్నారావు,దడిగల నాగేశ్వరరావు, ఉప్పెర్ల వెంకన్న, నవీన్‌కుమార్, అర్చన తదితరులున్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో..

గుండాల: వాసవి క్లబ్ గ్రీన్ ఫీల్డ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఎంబీబీఎస్ లో సీట్ సాధించిన ఇద్దరు విద్యార్థినులకు మండలం కేంద్రంలో బుధవారం ఘనంగా సన్మానం నిర్వహించారు. ఎంబీబీఎస్లో సీట్ సాధించిన సాయినపల్లి గ్రామానికి చెందిన ఇర్ప నాగేశ్వరరావు సుశీల దంపతుల కుమార్తెలు అమృతరాణి, బేబీ ప్రసన్నలను వాసవి క్లబ్ మండల అధ్యక్షుడి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మానాల నారాయణమూర్తి, మానాల ప్రణీత్, నాగరాజు, రాంబాబు, అయితా శ్రీశైలం, అయిత పూజిత్, ఐత నాగమల్లయ్య, తాటికొండ వీరన్న, పాలడుగు భరత్, శ్రీరంగం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బూర్గంపాడు: సుజితను అభినందిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు



గుండాల: ఎంబీబీఎస్ విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

19న ఇసుక వేలంపాట

ములకలపల్లి: ఈ నెల 19వ తేదీన ఇసుక బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు తహసీల్దార్ గుడ్ల పుల్లారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ సందర్భాల్లో స్వాధీనం చేసుకున్న మూడు ట్రాక్టర్లు, ఒక లారీలోని ఇసుకను తహసీల్ ఆవరణలో ఉదయం 11 గంటలకు వేలం వేయనునట్లు తెలిపారు. షెడ్యూల్ తెగలకు చెందిన వారు మాత్రమే వేలంలో పాల్గొనేందుకు అర్హులని తహసీల్దార్ పేర్కొన్నారు.

నేడు శబరి స్మృతి యాత్ర

అశ్వారావుపేటరూరల్: దేవదాయ శాఖ, భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే శబరి స్మృతి యాత్ర నేడు (గురువారం) అశ్వారావుపేట మండలం వినాయకపురం వద్ద ఉన్న చిలకల గండీ ముత్యాలమ్మ ఆలయం వద్దకు చేరుతుందని స్థానిక ఆలయ ఈఓ సూర్య ప్రకాశ్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. శ్రీస్వామి వారి ప్రచార రథముతో శోభాయాత్ర ఉదయం 8.30 గంటలకు ముత్యాలమ్మ తల్లి ఆలయానికి చేరుతుందని, అనంతరం గ్రామంలో శోభాయాత్ర నిర్వహిస్తామని చెప్పారు. స్వామి వారి ప్రచారమూర్తుల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించి, భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు.

హామీలు అమలు చేయాలి

దమ్మపేట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ప్రకటించిన హామీలను తూచా తప్పకుండా అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని చిన్నగొల్లగూడెం గ్రామంలో సీపీఎం గ్రామసభను నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం జిల్లా నాయకులు దొడ్డా లక్ష్మీనారాయణ, మండల నాయకులు మోరంపూడి శ్రీనివాసరావులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను పూర్తిగా విస్మరించిందని అన్నారు. హామీలు అమలు చేయని పక్షంలో ప్రజా పోరాటాలకు సీపీఎం సిద్ధంగా ఉందని హెచ్చరించారు. అనంతరం చిన్నగొల్లగూడెం సీపీఎం పార్టీ గ్రామ శాఖ నూతన కార్యదర్శిగా పిట్టల పోలమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పిట్టల పోలమ్మ, మళ్లా సత్యం, రాజిని జ్యోతి, వనమ లక్ష్మి, మహాలక్ష్మి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

కరకగూడెం: మండల పరిధిలోని అశ్వాపురం పాడ్ వలస ఆదివాసీ గ్రామంలో కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కారం మధు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 36 మంది గ్రామస్తులను పరీక్షించి మందులు అందజేశారు. శిబిరంలో హెచ్ఈఓ పోలెబోయిన కృష్ణయ్య, హెచ్‌ఏ కృష్ణ, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమాచారికి పరామర్శ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణానికి చెందిన తెలంగాణ రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది పూసాల కృష్ణమాచారి తల్లి పూసాల అనసూయ సంస్మరణ సభను బుధవారం నిర్వహించగా.. కార్యక్రమానికి భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి మీసాల వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావులు హాజరయ్యారు. కృష్ణమాచారి కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలిపారు. అనంతరం సభను ఉద్దేశించి పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం, సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, భద్రాచలం కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

గుండాల: మండలంలో నెలకొన్న సమస్యలపై అధికారులు దృష్టి సారించి పరిష్కరించేందుకు కృషి చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆళ్లపల్లి మండలంలో బుధవారం పర్యటించిన ఎమ్మెల్యే బోడాయికుంట, నడిమిగూడెం పంచాయతీ కేంద్రాలతో పాటు రాయిగూడెంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జరుగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనులను అధికారుల ద్వారా తెలుసుకున్నారు. ఏ గ్రామంలో కూడా మంచినీటి సమస్య తలెత్తకూడదని, వారం రోజుల్లో ప్రతీ ఇంటికి నీళ్లందించాలని అధికారులను ఆదేశించారు. ఏ గ్రామంలో అంగన్‌వాడీ భవనం లేదో స్థలాలు చూసి, ప్రణాళికలు పంపాలని పీఆర్ అధికారులను ఆదేశించారు. ఇంకా రోడ్లు, వాగులపై బ్రిడ్జీ సమస్యలు ఉన్నట్లయితే వెంటనే ప్రణాళికలు పంపాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆళ్లపల్లిలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన చింతకుంట, రాఘవాపురం జట్లకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అందించారు. తహసీల్దార్ శకుంతల, ఎంపీడీఓ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంనర్సయ్య, పడిగ సమ్మయ్య, అతహాత్, ఖదీర్, పాయం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం

మృతులకు నివాళి

బూర్గంపాడు: మండల పరిధిలోని బుడ్డగూడెం గ్రామానికి చెందిన సోడె సారయ్య, సోడె నరేష్‌లు మంగళవారం రాత్రి పాల్వంచలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా.. వారి మృతదేహాలను బుధవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సందర్శించి నివాళులర్పించారు. మృతుల కుటుంబాలను ఓదార్చి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. కుటుంబాలకు ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, కైపు లక్ష్మీ నారాయణరెడ్డి, తాటి వీరాంజనేయులు, కాటం వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

భద్రాచలంఅర్బన్: పాల్వంచ మండల పరిధిలోని సీతారాంపట్నం 220 కేవీ సబ్ స్టేషన్ నుంచి భద్రాచలం (ఎటపాక)కు వచ్చే 132కేవి విద్యుత్ లైన్ మరమ్మతులు కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు భద్రాచలం డీఈ జీవన కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

భద్రాచలం పట్టణంతోపాటు, దుమ్ముగూడెం, చర్ల, బూర్గంపాడు మండలాల్లో గురువారం ఉదయం విద్యుత్ అంతరాయం కలుగుతుందని, ఈ మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు అధికారులకు సహకరించాలని కోరారు. అయితే భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం సబ్ స్టేషన్‌కు వచ్చే 33/11కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా నేడు(గురువారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పాడుతున్నట్లు స్థానిక ట్రాన్స్‌కో ఏఈఈ సంతోష్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. ఫీడర్ మరమ్మతుల కారణంగా వినాయకపురం, నారాయణపురం, గంగారం సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. ఆయా గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులంతా గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా మత్తు వైద్యుల దినోత్సవం



ఐఎంఏ భద్రాచలం శాఖ ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న వైద్యులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో బుధవారం ప్రపంచ మత్తు వైద్యుల దినోత్సవాన్ని భద్రాచలం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన వైద్యులు రమేష్ చంద్ర దత్, కృష్ణ ప్రసాద్, లోకేశ్, మల్లేష్, సురేష్ కుమార్‌లు కేక్ కట్ చేశారు. డాక్టర్ రమేష్ చంద్ర దత్ మాట్లాడుతూ.. వైద్య వృత్తిలో మత్తు వైద్యుడికి ఎంతో ప్రధాన్యం ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకుని అందరూ ప్రతి వైద్యుడిని మర్యాదపూర్వకంగానే చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ భద్రాచలం శాఖ సభ్యులు అబ్దుల్ లతీఫ్, నిఖీత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ములకలపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థుల కుటుంబాలకు రాష్ట్ర పశువైద్యుల సంఘం ఆధ్వర్యంలో లక్ష రూపాయలు ఆర్థికసాయం అందజేశారు. గత నెల 17వ తేదీన పాల్వంచ నుంచి స్కూల్ పిల్లలతో వస్తున్న ఆటోను రాంగ్ రూట్ వచ్చిన కారు ఎదురుగా ఢీ కొట్టిన ఘటనలో ఒక విద్యార్థి మృతి చెందిగా.. ఆటో డ్రైవర్‌తోపాటు మరో ఐదుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలకు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రమేశ్‌బాబు నేతృత్వంలో బాసటగా నిలిచారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాణోతు రాజేశ్వరరావు, సీనియర్ డాక్టర్లు బద్దూలాల్, సంతోష్, స్థానిక పశువైద్యాధికారి బి.రామకృష్ణ ఆధ్వర్యంలో సేకరించిన రూ.లక్ష నగదును బుధవారం కుటుంబాలకు అందజేశారు.

భక్తులకు అన్నదానం

మణుగూరురూరల్: దసరా పండుగ దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సమితిసింగారం బస్ డిపో ప్రాంతంలోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయం, పీకే-1 సెంటర్‌లలో బుధవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమాల్లో ఆయా ఉత్సవ కమిటీల సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఫలహార దీక్ష విరమణ

గుండాల: ఓల్డ్ పెన్షన్స్ స్కీం, టీచర్ ఎమ్మెల్సీ ఎలక్షన్ల ఎస్జీటీలకు ఓటు హక్కు కోసం చేపట్టిన 108 రోజుల ఫలహార దీక్షను జాకారం హెచ్‌ఎం మహమూద్ పాషా ముగించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆళ్లపల్లి మండలం పర్యటనకు రాగా.. పాషా ఆయనను కలిసి వినతిపత్రం అందించారు.దీక్ష విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో దీక్ష విరమించినట్లు పాషా తెలిపారు. ప్రభుత్వ స్పందన ఆశించిన స్థాయిలో లేకపోతే రానున్న రోజుల్లో జిల్లా, రాష్ట్ర ,దేశ కేంద్రాలలో నిరసన, నిరాహార దీక్షలు చేయడానికి వెనుకాడబోనని ఈ సందర్భంగా పాషా వెల్లడించారు. దీక్షకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలకు రక్షణ కరువు



సమావేశంలో మాట్లాడుతున్న అన్నవరపు కనకయ్య

పినపాక: బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలకు రక్షణ లేకుండా పోతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మండల కమిటీ సభ్యులు, గ్రామ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎప్పుడు ఎన్నికలు వస్తే అప్పుడు నిర్వహించాల్సిందే అని అన్నారు. ఎర్రజెండా పేదలకు, రైతులకు అండగా ఉంటుందని వారి తరపున నిత్యం పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నిర్మల వెంకన్న, మడివి రమేష్, శంకరయ్య పాల్గొన్నారు.

రామయ్యకు నివాళి

మణుగూరుటౌన్: సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య సోదరుడు రామయ్య మంగళవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కొత్తగూడెం జిల్లా సీపీఐ కార్యదర్శి సాబీర్ పాషా, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఆవుల సర్వేశ్వరరావు, బీఆర్ఎస్ నేతలు వట్టం రాంబాబు, కుర్రి నాగేశ్వరరావు, అక్కి నర్సింహారావు, నూకారపు రమేశ్, రామానుజవరం మాజీ సర్పంచ్ బాడిశ సతీష్, సీపీఐ, ఏఐటీయూసీ నేతలు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన 'ఆల్ పెన్షనర్స్'

భద్రాచలంఅర్బన్: భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుని బుధవారం ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు చర్ల రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ సంఘ కార్యాలయానికి స్థలాన్ని కేటాయించడంతోపాటు ఇతర సమస్యలను పరిష్కరించాల్సిందిగా వినతిపత్రాన్ని ఎమ్మెల్యే వెంకట్రావుకి అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే వెంకట్రావు.. తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భ్రాచలం డివిజన్ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చల్లగుళ్ళ నాగేశ్వరరావు, డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వరరావు, కేఎస్ ఎల్వి ప్రసాద్, డి.కృష్ణమూర్తి, సుబ్బయ్య చౌదరి, రాజబాబు, శివప్రసాద్, ఐలయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వెంకట్రావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు